అస్తవ్యస్తంగా రైతుబజార్

- బురదమయమైన ఆవరణం
- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- వ్యాపారులు, కొనుగోలుదారులకు తప్పని తిప్పలు



అలంకారప్రాయంగా దుకాణ సముదాయం



బురదమయంగా మారిన రైతుబజార్ ఆవరణ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని రైతుబజార్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది. చిన్నపాటి వర్షానికే రైతుబజార్ ఆవరణ చిత్తడిగా మారుతోంది. జోరు వానాలు కురిస్తే పూర్తిగా బురదమయమవుతుంది. అలాగే రోజుల తరబడి చెత్తాచెదారాన్ని తొలగించకపోవడంతో పరిసరాలన్నీ అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన సముదాయాలు అధికారుల పట్టింపులేనితనంతో అలంకార ప్రాయంగా మారాయి. దీంతో వ్యాపారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రతిఏడాది వర్షాకాలంలో ఇదే పరిస్థితి ఏర్పడుతున్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

దబ్బులు చెల్లిస్తున్నా వసతులు కరువు..

ఆదిలాబాద్ పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని రైతులు పండించిన కూరగాయలను విక్రయించేందు స్థానిక రాంలీలా మైదానాన్ని ఆనుకుని ప్రభుత్వం రైతుబజార్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో 40 మంది రైతులు తమ చేలల్లో పండించిన పంటలను తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. అలాగే మార్కెటింగ్ శాఖ నుంచి అనుమతి పొందిన మరో 65 మంది వ్యాపారులు బీట్‌లో కూరగాయలను కొనుగోలు చేసి రైతుబజార్‌లో నిర్ణయించిన ధరలకు విక్రయిస్తుంటారు. వీరు రైతుబజార్ నిర్వహణ కోసం రోజుకు రూ.50 చొప్పున నెలకు రూ.1500 చెల్లిస్తుంటారు. అయితే అధికారుల పట్టింపులేనితనంతో రైతుబజార్ నిర్వహణ అధ్వానంగా మారింది. వర్షాలకు పరిసరాలన్నీ బురదమయం కాగా, ఇక్కడ పోగైన చెత్తను రోజుల తరబడి తరలించకపోవడంతో పేరుకుపోయింది.

అలంకారప్రాయంగా దుకాణ సముదాయాలు..

కూరగాయలను విక్రయించే వారి కోసం రైతుబజార్‌లో 50కి పైగా దుకాణాలతో కూడిన సముదాయాన్ని నిర్మించారు. వాటిల్లో కూరగాయల విక్రయాలు సాగించాల్సి ఉండగా.. విక్రేతలు రైతు బజార్ ఆవరణలోనే విక్రయిస్తున్నారు. దీంతో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన దుకాణాలు అలంకారప్రాయంగా మారాయి. ఇటీవల పార్కింగ్ కోసం కేటాయించిన స్థలంలోనూ విక్రయాలు జరుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ పోలీసుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇంత జరుగుతున్న మార్కెటింగ్ అధికారులు మాత్రం దీనిపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా ఉన్నాతాధికారులు స్పందించి వసతులు కల్పించాలని వ్యాపారులు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



ఇటీవల కురుస్తున్న వర్షాలకు రైతుబజార్ పరిసరాలన్నీ చిత్తడిగా మారుతున్నాయి. బురదమయంగా మారడంతో పాటు పైన ఎలాంటి కప్పు లేకపోవడంతో వర్షంలో తడుస్తూ.. కూరగాయలు అమ్మాల్సి వస్తోంది. కొనుగోలు చేసేందుకు వచ్చేవారు సైతం ఇబ్బంది పడుతున్నారు.

– లక్ష్మి, కూరగాయల వ్యాపారి

అధికారులకు విన్నవించాం



కూరగాయలను విక్రయించే ప్రాంతమంతా బురదమయంగా మారుతోంది. దీంతో కొనుగోలు చేసేందుకు వచ్చేవారితో పాటు మేము కూడా ఇబ్బంది పడుతున్నాం. ఈ పరిస్థితిని తొలగించేలా చూడాలని మార్కెటింగ్‌శాఖ అధికారులకు విన్నవిస్తూనే ఉన్నాం. అయినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

– పద్మ, కూరగాయల వ్యాపారి

క్లుప్తంగా

మినీ స్టేడియం ఏర్పాటు చేయాలి

నేరడిగొండ: మండల కేంద్రంలో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని మండల కేంద్రంలోని యువకులు, క్రీడాకారులు కోరారు. శనివారం జెడ్పీటీసీ అనిల్ జాదవ్, ఎంపీపీ రాథోడ్ సజన్, సర్పంచ్ పెంట వెంకటరమణ, తహసీల్దార్ పవన్‌చంద్ర, ఎంపీడీవో అబ్దుల్ సమద్‌లకు వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. స్టేడియం లేకపోవడంతో క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. జాతీయ రహదారి వెంట వెళ్లాల్సిన వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాథోడ్ పవన్, జాదవ్ పాండు, రాథోడ్ రాజశేఖర్, శేఖర్, దినేష్, అల్లం రాకేశ్ పాల్గొన్నారు.

స్థలం కేటాయించండి

బోథ్: స్వయం కృషి రైతు సంఘానికి మండల కేంద్రంలో భవనం నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని సంఘం సభ్యులు శనివారం సర్పంచ్ సురేందర్, పంచాయతీ కార్యదర్శి అంజయ్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరం పెద్దార్ల హనుమాన్ ఆలయానికి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని ఏఈ వెంకటేశ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు ఇట్టెడి మోహన్‌రెడ్డి, సభ్యులు రావుల శంకర్, మంజారి రాజారాం, చాంద్ పాషా. సుధాకర్, సింగం రమణ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరించండి

బోథ్: ఓటరు జాబితాను సవరించాలని కాంగ్రెస్ నాయకులు శనివారం ఓటరు నమోదు అధికారి సురేశ్‌కు విన్నవించారు. ఓటరు నమోద్ ప్రక్రియను పరిశీలించడానికి వచ్చిన అధికారికి పలు సమస్యలను వివరించారు. చాలా చోట్ల ఓటరు నమోదులో తప్పులు జరిగాయని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో నాయకులు పసుల చంటి, షాకీర్, మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

గంగాపూర్‌లో వైద్య శిబిరం

నార్నూర్: వర్షాకాలంలో వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు అన్నారు. శనివారం మండలంలోని గంగాపూర్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటింటికీ తిరుగుతూ రోగుల వివరాలను నమోదు చేయడంతో దగ్గు, జలుబు, జ్వరం ఉన్న వారిని గుర్తించి వైద్య పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ ఉంచవద్దన్నారు. వైద్య శిబిరంలో హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, ఏఎన్‌ఎంలు సుశీల, సింధు పాల్గొన్నారు.

17న ఇంద్రవెల్లికి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ రాక

ఇంద్రవెల్లి: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఈనెల 17న ఇందవెల్లి మండలానికి రానున్నట్లు బీఎస్పీ మండల అధ్యక్షుడు పెందోర్ అంకుష్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. బహుజనుల బతుకులు మారాలంటే బీఎస్పీతో సాధ్యమవుతుందన్నారు. మండల కేంద్రంలో బీఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించి, అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. బీఎస్పీ ఉట్నూర్ డివిజన్ అధ్యక్షుడు సోన్‌కాంబ్లే సునీల్, మండల మహిళ విభాగం అధ్యక్షురాలు సోన్‌కాంబ్లే సుకేష్మ, పట్టణ అధ్యక్షుడు భవాలే కిరణ్, ఉపాధ్యక్షుడు కాంబ్లే దీపక్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ జైవంత్‌రావు సూచించారు. శనివారం ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. రోగులకు అందుతునన వైద్య సేవలను డాక్టర్ మహేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు రషీద్, రమేశ్, బలిరాం, సింగారే భరత్ ఉన్నారు.

గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి

ఇచ్చోడ: గర్భిణులు ప్రతీనెల వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాగర్ అన్నారు. శనివారం కోకస్‌మాన్నూర్ సబ్‌సెంటర్ పరిధిలో ఇస్లాంనగర్ గ్రామంలో నిర్వహిస్తున్న యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగాంను సందర్శించి మాట్లాడారు. గర్భిణులు ఆకుకూరలు, పాలు, గుడ్లు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కైలాస్, ఏఎన్‌ఎంలు తులసి, అహల్య, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అభివృద్ధి పనులు

ఇంద్రవెల్లి: మండలంలోని ముత్నూర్ గ్రామ పంచాయతీకి స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2023 అవార్డులో భాగంగా అభివృద్ధి పనులను అధికారులు ముమ్మరం చేశారు. డిప్యూటీ సీఈవో రాథోడ్ రాజేశ్వర్ దగ్గరుండి ఇంటింటికీ మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు నిర్మిస్తున్నారు. జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ జరుగుతున్న పనులను పర్యవేక్షణ చేస్తున్నారు. గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పుష్పలత, ఏపీవో శ్రీనివాస్, ఎంపీవో సంతోశ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయం

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం మండలంలోని రాములగూడలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ. 74 లక్షల వ్యయంతో బీటీరోడ్డు, రూ. 10 లక్షల వ్యయంతో సవారీ బంగ్లా నిర్మించడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో తెలంగాణ సంక్షేమ పథకాలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు మంజూరు చేస్తుందన్నారు. మొహరం పండుగ సమీపిస్తున్న దృష్ట్యా రూ. 6 కోట్ల నిధులతో అన్ని గ్రామాల్లో సవారీ బంగ్లాలు నిర్మించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గండ్రత్ రమేశ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొమ్మకంటి రమేశ్, ఆత్మ చైర్మన్ జిట్ట రమేశ్, మెట్టు ప్రహ్లాద్, సెవ్వా జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

‘గిరిజనేతరులకు పోడు పట్టాలు అందించాలి’



నేరడిగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

నేరడిగొండ: గిరిజనేతరులకు పోడు పట్టాలు అందించాలని వివిధ గ్రామాల ప్రజలు మండల కేంద్రంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి, తహసీల్దార్ పవన్‌చంద్ర, ఎంపీడీవో అబ్దుల్ సమద్, జెడ్పీటీసీ అనిల్ జాదవ్‌లకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. మండల రైతులు గడ్డం భీంరెడ్డి, హీరాసింగ్, గస్కంటి రవి, సాబ్లే సంతోశ్‌సింగ్‌లు మాట్లాడుతూ.. గత ఏళ్ల కాలం నాటి నుంచి పోడు భూములనే నమ్ముకొని బతుకుతున్న రైతులను అన్ని ప్రభుత్వాలు ఓట్ల కోసమే వినియోగించుకుంటున్నాయని ఆరోపించారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం పోడు భూములున్న రైతులందరికీ పట్టాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు సోలంకి ప్రశాంత్, అందుసింగ్, శ్రీను, సురేశ్, మాన్‌సింగ్, భజన్‌లాల్, మోతిలాల్, దర్బార్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

రథయాత్రను జయప్రదం చేయండి



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలనే డిమాండ్‌తో సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు చేపట్టిన పాతపెన్షన్ సాధన సంకల్ప రథయాత్రను విజయవంతం చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణకుమార్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుడాల రవీందర్, రాష్ట్ర సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ అసోసియేట్ అధ్యక్షుడు సత్యనారాయణ, నవీన్‌కుమార్, అవినాష్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారుగూడ మోడల్, మైనార్టీ స్కూల్‌లలో శనివారం పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎస్ సీపీఎస్‌ఈయూ జిల్లా శాఖ నాయకులు నవీన్, అవినాష్‌లు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 1.80 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టం కలిగిస్తున్న సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రథయాత్ర జూలై 24న ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్‌లోకి ప్రవేశిస్తుందన్నారు. సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొని రథయాత్రను విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా శివకథ పారాయణం



పట్టణంలో సాగుతున్న శోభాయాత్ర

కైలాస్‌నగర్: తాంసి మండలంలోని పొన్నారి సంకట మోచన హనుమాన్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న శివకథ పారాయణ శనివారం వైభవంగా ప్రారంభమైంది. మొదటి రోజు రాజస్తాన్‌లోని జోధ్‌పూర్‌కు చెందిన అధ్యాత్మిక గురువు శ్రీరాంజీ మహారాజ్, శివ పురాణ గ్రంథంతో భక్తులు శోభాయాత్ర చేపట్టారు. స్థానిక గోపాలకృష్ణ మఠం నుంచి డప్పుచప్పుళ్లు, మేళతాళాలు, గుస్సాడీ నృత్యాలతో శోభాయాత్ర సందడిగా సాగింది. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, సంకట్ మోచన హనుమాన్ ఆలయ కమిటీ ప్రతినిధులు మేఘరాజ్ మటోలియ, ముకుల్‌చంద్ మటోలియా పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆర్థిక సాయం

నార్నూర్: గాదిగూడ మండలంలోని లోకారి గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజన మహిళ ఆత్రం జంగుబాయి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న సామాజిక కార్యకర్త చౌహాన్ శ్రీనివాస్ శనివారం లోకారి గ్రామానికి వెళ్లి బాధిత గిరిజన మహిళ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆమెకు రూ. 5వేలు ఆర్థిక సాయం అందజేశారు. గాదిగూడ మండలం జైజంగు జైలింగు అధ్యక్షుడు వేద్మా విషం రావు, ఉపాధ్యాయుడు అర్జున్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: ఆదిలాబాద్ మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన నర్సింహులు కాలు విరిగి ఇంట్లో ఉండడంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. శనివారం మహారాష్ట్ర బ్యాంకు సిబ్బంది శనివారం రూ. 6వేల నగదును కుటుంబసభ్యులకు అందజేశారు. మేనేజర్ శ్రీకాంత్, స్పెషల్ అసిస్టెంట్ కాడే స్వామి, క్యాషియర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

బోథ్: మండలంలోని బాబెరతండా గ్రామానికి చెందిన జాదవ్ శోభారాణికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎంపీపీ తుల శ్రీనివాస్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఇచ్చోడ ఎంపీపీ ప్రీతంరెడ్డి, పిప్పల్‌ధరి సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, రోహిదాస్ పాల్గొన్నారు.

జంతువులతో ప్రేమగా ఉండాలి

బోథ్: జంతువులతో ప్రతిఒక్కరూ ప్రేమగా ఉండాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత అన్నారు. జంతు ప్రేమికుడు లక్ష్మణ్ రాసిన ద జర్నీ ఆఫ్ బంటి పుస్తకంలో జంతువుల పట్ల ప్రేమగా ఉండాలని చక్కగా వివరించినట్లు పేర్కొన్నారు. ఇచ్చోడ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వినోద్, సాధ, బోథ్ వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, చరణ్, రమేశ్, సంతోశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

బోథ్: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో సామాజిక వేత్త నిమ్మల సంతోశ్ రెడ్డి విద్యార్థులకు శనివారం క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు పాఠశాల ప్రత్యేకాధికారి రాథోడ్ వలిత కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇచ్చోడ అంబేద్కర్ సంఘం నాయకులు లక్ష్మణ్, సరస్వతి శిశుమందిర్ కోశాధికారి సుదర్శన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎల్పీ నేతను కలిసిన కాంగ్రెస్ నాయకులు

కైలాస్‌నగర్: సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కను టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గండ్రత్ సుజాత, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాదులోని సీఎల్పీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. పలు అంశాలపై చర్చించారు.

‘బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి’



సవారీ బంగ్లాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఇచ్చోడ: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. శనివారం మండలంలోని కామగారిలో రూ. 4 లక్షలతో నిర్మించిన సవారీ బంగ్లాను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ కష్టాలు..



చెత్తను ట్రాక్టర్‌లో వేస్తున్న పంచాయతీ కార్యదర్శి

పంచాయతీ కార్మికుల సమ్మెతో గ్రామాల్లో చెత్త పేరుకుపోయింది. దీంతో బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామపంచాయతీ కార్యదర్శి గంగయ్య చెత్తను ఎత్తి ట్రాక్టర్‌లో వేశాడు. గ్రామంలో ట్రాక్టర్‌ను తిప్పుతూ.. కొంతమంది వ్యక్తుల సాయంతో చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించాడు. అలాగే ఇచ్చోడ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద చెత్త పేరుకుపోయి, తీవ్ర దుర్గంధం వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల వెంట చెత్తాచెదారం దర్శనమిస్తోంది.

– బోథ్, ఇచ్చోడ



ఇచ్చోడలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమ్మెకు మద్దతు తెలుపుతున్న ఆడే గజేందర్

నేరడిగొండ: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించానలి కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ నాయకుడు ఆడే గజేందర్ డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులు చేపడుతున్న సమ్మె శనివారం మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆడె వసంత్ రావు, బోథ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి ప్రఫుల్‌చందర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, అమర్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: కార్మికుల సమ్మెకు మద్దతుగా ప్రతిరోజు భోజ్జన్న మధ్యాహ్నం భోజనం పెట్టడం జరుగుతుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ భొజ్జు పటేల్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులకు అన్నదానం చేశారు. కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ కన్వీనర్ బిరుదుల లాజర్, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దూట రాజేశ్వర్, ఇమ్రాన్, సలీం, రాహుల జాదవ్ మాణిక్‌రావు, భీమన్న, కిషన్, జైవంత్, మహేందర్ పాల్గొన్నారు.

‘అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోం’



మాట్లాడుతున్న మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్

ఉట్నూర్‌రూరల్: బీజేపీపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోమని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని తన నివాసంలో మాట్లాడారు. తాను బీజేపీ నుంచి ఇతర పార్టీలకు వెళ్తున్నట్లు ప్రచారం చేయడం సరికాదన్నారు. ఎన్నికల్లో కచ్చితంగా బీజేపీ గెలుపు ఖాయమని, బీజేపీలోనే ఉంటూ.. బీజేపీ గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తామన్నారు. ఎక్కడికీ వెళ్లిన బీజేపీకి ప్రజలను ఆదరణ లభిస్తుందన్నారు. బీఆర్‌ఎస్ నియంత పాలనకు ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయన్నారు. సీఎం కేసీఆర్ ఉచిత హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. మంత్రి ఐకేరెడ్డి నిర్మల్ జిల్లాకే పరిమితమయ్యారని, అందిన కాడికి దోచుకుంటూ.. ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో మండల అధ్యక్షుడు రాజశేఖర్, జాతీయ నాయకులు శ్రీరామ్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండేరి రమేశ్, గట్కు రమేశ్, ఉస్కమొల్ల దేవిదాస్, బొడ్డు కిరణ్, లింగాగౌడ్ పాల్గొన్నారు.

హ్యుందాయ్ మైక్రో ఎస్‌యూవీ కారు విడుదల



కారును ఆవిష్కరిస్తున్న ఎస్‌బీఐ ఆర్‌ఎం శ్రీనివాస్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రకాష్ హ్యుందాయ్ షోరూంలో మైక్రో ఎస్‌యూవీ ఎక్స్‌టర్ కారును శనివారం ఎస్‌బీఐ బ్యాంకు ఆర్‌ఎం శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఎండీ నల్ల దినేష్‌రెడ్డి మాట్లాడుతూ.. హ్యుందాయ్ మోటార్ ఇండియా ప్రారంభమైనప్పటి నుంచి ఎస్‌యూవీ (స్పోర్ట్ యుటిలిటీ వాహనం) విభాగంలోకి అడుగుపెట్టిందన్నారు. కారు ప్రారంభ ధర రూ. 5.99 లక్షల నుంచి రూ. 9.31 లక్షలుగా ఉందన్నారు. పెట్రోల్ వెర్షన్ మైలేజ్ 19.4 కిలో మీటర్లుగా సీఎన్‌జీ మైలేజ్ 27.1 కిలో మీటర్లు వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో షోరూం మేనేజర్ ఉమాకాంత్‌రెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

నేడు సన్నాహక సమావేశం

బోథ్: ఆదిలాబాద్‌లోని తన నివాసంలో ఆదివారం ఉదయం 12 గంటలకు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు తెలిపారు. మంత్రి కేటీఆర్ ఆదేశాల ప్రకారం.. ‘మూడు గంటలు కరెంటు కావాలా.. మూడు పంటలు కావాలా’ అనే నినాదంతో ఈనెల 17నుంచి పది రోజుల పాటు నియోజకవర్గంలోని అన్ని రైతువేదికల్లో చేపట్టే నిరసన కార్యక్రమాలపై చర్చిస్తామన్నారు.

బోథ్ డివిజన్ ఏర్పాటు కోసం..

బోథ్: బోథ్ డివిజన్ ఏర్పాటు కోసం ఆదివారం మండలవాసులు స్థానిక షాదీఖానాలో సమావేశం నిర్వహించనున్నట్లు బోథ్ డివిజన్ పోరాట సమితి నాయకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మండల సాధన కమిటీ..

తలమడుగు: మండలంలోని బరంపూర్ గ్రామంలో ఆదివారం బరంపూర్ గ్రామాన్ని మండల కేంద్రం ఏర్పాటు చేయాలని సాధన కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు మాజీ జెడ్పీటీసీ బాబన్న ఒక ప్రకటన కోరారు. వివిధ గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అలాగే బరంపూర్ మండల సాధన కమిటీ కార్యవర్గాన్ని ఎన్నికోవడం జరుగుతుందన్నారు.

కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు

బేల: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం కార్మికశాఖ ఆధ్వర్యంలో సీఎస్‌సీ హెల్త్‌కేర్ సౌజన్యంతో కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు హెల్త్‌కేర్ జిల్లా కో ఆర్డినేటర్ సయ్యద్ పర్వేజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మిక శాఖ నుంచి గుర్తింపు కార్డులు పొందిన కార్మికులకు రూ.15వేల విలువ గల 50 రకాల వైద్య పరీక్షల కోసం నామునాలు సేకరిస్తామని తెలిపారు.